క్లుప్తంగా

ఒకరి రిమాండ్

దామెర: దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పరకాల రూరల్ సీఐ మల్లేష్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన ఆలేటి శ్రీనివాస్ ఈ నెల 19వ తేదీన ఇంటికి తాళంవేసి తన కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడకు వెళ్లాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రాకేష్ ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని రెండు తులాల బంగారు నెక్లెస్, 18 తులాల పట్టగొలుసులు, 20 వేల రూపాయల నగదు చోరీ చేశారు. ఈ విషయమై బాధితుడు శ్రీనివాస్ ఈ నెల 21వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శనివారం దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను వరంగల్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా రాకేష్‌ను ములుగు క్రాస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.2 లక్షలు సీజ్



కమలాపూర్: మండలంలోని అంబాల క్రాస్ రోడ్డు వద్ద పరకాల నుంచి కరీంనగర్ వెళ్తున్న మడికొండకు చెందిన బేతి మహేష్‌కుమార్ వద్ద నుంచి రూ.2 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ తెలిపారు. శనివారం అంబాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహేష్ వద్ద రూ.2 లక్షలు లభించాయని, నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు అతని వద్ద లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఏసీపీ వివరించారు. ఈ తనిఖీల్లో ఎస్సై కరుణాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి అప్పగింత



ఆత్మకూరు: మండలంలోని నాగయ్యపల్లిలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి కనిపించగా పంచాయతీ సిబ్బంది గమనించి పోలీసుల సాయంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌కు చెందిన మంద ప్రకాశ్ శనివారం తెల్లవారు జామున నాగయ్యపల్లిలో తిరుగుతున్నాడు. పారిశుద్ధ్య, జీపీ సిబ్బంది గమనించి సమాచారం సేకరించి సీఐ రవిరాజు సూచనతో పోలీసుల సాయంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక సర్పంచ్ మాదాసి రజిత రమేష్, కారోబార్ రాజు, సారంగం, సాంబయ్యలను పలువురు అభినందించారు. పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, గుండాల కట్టమల్లుతో పాటు తదితరులు ఉన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌కు డాక్టరేట్

వరంగల్: వరంగల్ నర్సింగ్ కళాశాలలోని గ్రేడ్-1 సూపరింటెండెంట్ బీ.లక్ష్మీభాయికి పాండిచ్చేరిలోని కంబన్ కలైరంగం ఆడిటోరియంలో హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేసింది. లక్ష్మీభాయి పలు సేవా కార్యక్రమాలు, అనేక వైద్య శిబిరం నిర్వహించడం, నేత్రదానం చేసేందుకు కృషి చేయడంతో పాటు ఆపరేషన్లు చేయించినందుకు ఆమె సేవలను గుర్తించి డాక్టరేట్ అందించారు. డాక్టరేట్ అందుకున్న లక్ష్మీభాయిని సహచర ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.

సర్కిల్ కార్యాలయం తనిఖీ

వరంగల్ అర్బన్: కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి చాంబర్, జనన, మరణ ధ్రువీకరణ విభాగం, పర్యవేక్షకులు, టౌన్ ప్లానింగ్ విభాగాల్లోని చాంబర్లను పరిశీలించి, అధికారులు, ఉద్యోగులు హాజరు వివరాలపై ఆరా తీశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. సిటిజన్ చార్టర్‌ను పక్కాగా అమలు చేయాలని అనిసుర్ రషీద్ సూచించారు. డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారి షహజాది బేగం, పర్యవేక్షకులు హబీబ్, ఆర్ఐలు విజయ్, సోహైల్ ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం

హసన్‌పర్తి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నేర నిరోధక విభాగం సీఐ ఎస్.వెంకట్రాం హెచ్చరించారు. బాలల అక్రమ రవాణాపై ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి ఆధ్వర్యంలో పెగడపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సహాయం కోసం 100, 102, 1098, 181, 1930 హెల్ప్‌లైన్ సెంటర్లకు కాల్ చేయాలని సూచించారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ ఇసంపల్లి సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప మేధావి వాల్మీకిబోయ



కమలాపూర్ : వాల్మీకిబోయ జయంతిలో పాల్గొన్న సీఐ, ఎస్సై

కమలాపూర్: మండలంలోని వంగపల్లిలో వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో శనివారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్, ఎస్సై కరుణాకర్, పోలీస్ సిబ్బంది, వాల్మీకి బోయ కులస్తులు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్కృత సాహిత్యంతో పేరు గావించిన కవి వాల్మీకిబోయ అన్నారు. రామాయణాన్ని రచించిన అతన్ని ఆదికవిగా గుర్తించారని తెలిపారు. శ్లోకాన్ని కనుగొన్న గొప్ప మేధావి వాల్మీకి అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు పెనుకుల సారయ్య, అధ్యక్షుడు పెనుకుల పున్నంచందర్, ఉపాధ్యక్షుడు పెనుకుల నరేందర్, కార్యవర్గ సభ్యులు పెనుకుల రవి, రాజేందర్, సాంబయ్య, కొండాల్, సాంబయ్య, ఓదెలు, మురళి, కృష్ణమూర్తి, శంకర్, రాజు, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలో వాల్మీకిబోయ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సంస్కృత సాహిత్యంతో గొప్ప పేరు పొందిన కవి వాల్మీకిబోయ అన్నారు. రామాయణాన్ని రచించాడని, ఆదికవిగా గుర్తింపబడ్డాడని, శ్లోకాన్ని కనుగొన్న గొప్ప మేధావి వాల్మీకి అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బేరుగు సాంబయ్య, సదానందం, రమేష్, సతీష్, సూర్యప్రకాష్, రవిచంద్ర, రమేష్, కన్నయ్య, చంద్రమౌళి, నాగరాజు, రమేష్, నాగరాజు, సాయి, ప్రశాంత్, వెంకటేష్, చందు, రజనీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : ఊరేగింపు చేస్తున్న బోయ కులస్తులు

అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలి



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న ఊరుగొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

దామెర: అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పవర్‌గ్రిడ్ డీజీఎం సమ్మయ్య అన్నారు. మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒగ్లాపూర్ పవర్‌గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో అవినీతి వద్దు–దేశానికి కట్టుబడి ఉండండి అనే అంశంపై విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2023లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ, భవిశ్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక



జనసేన పార్టీలో చేరిన యువకులు

ధర్మసాగర్: మండలంలోని కాశగూడెం గ్రామ యువకులు శనివారం జనసేన పార్టీలో చేరారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత రాజకీయాల్లో వచ్చే విధంగా జనసేన పార్టీ అవకాశం కల్పిస్తుందని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆయా నియోజకవర్గాల్లోని యువతను రాజకీయంగా అణిచివేస్తున్నారని ఆరోపించారు. యువకులు రాజకీయ ప్రస్థానం చేయాలని, ప్రతీ ఒక్కరికి హక్కు ఉందన్నారు. సయ్యద్ కాశీం, సయ్యద్ చోట కాశీం, షేక్ కరీమ్, జాఫర్, సయ్యద్ సర్దార్, అబ్బాస్, సలీం, ఉస్మాన్, షేక్ హుస్సేన్ చేరిన వారిలో ఉన్నారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం వచ్చే నాయకులను నిలదీయండి

- జీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి



శాయంపేట : ఇంటింటా ప్రచారం చేస్తున్న కీర్తిరెడ్డి

శాయంపేట : రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తున్న పలు పార్టీల నాయకులను నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. పార్టీలు మారిన వారితో పాటు హామీలు విస్మరించిన వారిని ప్రశ్నించాలని ఆమె సూచించారు. మండలంలోని సూర్యనాయక్ తండా, గంగిరేణిగూడెం, వసంతాపూర్, ప్రగతిసింగారం, రాజుపల్లి, సాధోనిపల్లి, కాట్రపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో శనివారం చేపట్టిన బీజేపీ భరోసా యాత్రలో ఆమె పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని ప్రజలకు వివరిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి విస్తృత ప్రచారం చేశారు. నియోజకర్గం అభివృద్ధి పథంలో నడువాలంటే ఒక్కసారి బీజేపీకి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య, పార్లమెంట్ కో కన్వీనర్ రఘునాథరెడ్డి, నాయకులు గడ్డం రమేష్, మొగిలి, రవికిరణ్, రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, రాజు, నాగరాజు, శ్రీకాంత్, శివ, సుమన్ పాల్గొన్నారు.

దామెర: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి అన్నారు. పరకాలలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ మండలంలోని కోగిల్వాయిలో గడపగడపకు తిరుగుతూ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిందేమి లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మోసం చేయాలని కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా ప్రధానకార్యదర్శి జితేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, యువ మోర్చ ఉపాధ్యక్షుడు చందర్, నాయకులు సుమంత్, మహేందర్, జగన్, రాజు పాల్గొన్నారు.

ఆత్మకూరు: బీసీ కులస్తులు అందరూ బీజేపీకి మద్దతుగా నిలవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెంచు రవి శనివారం బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సదానందం మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని సీఎం చేస్తామని అధిష్టానం ప్రటించడం హర్షణీయమన్నారు. బీసీ కులస్తులు బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గట్టు వేణు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాడ సౌమ్యశ్రీ కుటుంబాన్ని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన మాడ శివరాజ్–శ్యామల దంపతుల కూతురు మాడ సౌమ్యశ్రీ బీఎస్సీ నర్సింగ్ చేస్తూ ఇటీవలే కరీంనగర్ – మానకొండురు రోడ్డు వద్ద లారీ ఢీకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 26వ తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. అనంతరం అదే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బండారి రాజమ్మ, కానుగుల సరోజన కుటుంబాలను ధర్మారెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన పల్లెపాటి మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మారపల్లి కట్టయ్య శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 2వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఆ పార్టీ మండల నాయకులు వీరన్న, బుచ్చిరెడ్డి, రమేష్, రాజేందర్, వరదరాజు, మార్కండేయ, సదానందం, రఘువర్మ, భిక్షపతి, రాజయ్య, పరమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతోనే దళితులపై దాడులు



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఖిలా వరంగల్: బీజేపీ విధానాలతోనే దళితులపై దాడులు అధికమయ్యాయని, సామాజిక న్యాయాన్ని బీజేపీ సమాధి చేస్తోందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎలేందర్ అధ్యక్షతన దళిత సమ్మిట్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై 300 రేట్లు దాడులు పెరిగాయని వాపోయారు. ఈక్రమంలో ప్రజలంతా ఐక్యమై ప్రజా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 4న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భిక్షపతి, జన్ను రవి, జాన్‌పాల్, రాజేందర్, దేవరాజు, హరిబాబు, పైడి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

దామెర: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు దామెర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.రాజేష్‌కుమార్ తెలిపారు. హనుమకొండ డైట్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా యోగా పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన అఖిల, జశ్వనిక, హరికృష్ణ, వర్షిత్, నాగరాజు, అర్షిత్ సాయి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్1వ తేదీ వరకు సిద్దిపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులతో పాటు పీఈటీ కమలాకర్‌ను ప్రధానోపాధ్యాయుడు రాజేష్‌కుమర్, ఉపాధ్యాయులతో పాటు తదితరులు విద్యార్థులు అభినందించారు.

గీతకార్మికులను మోసం చేసిన కేసీఆర్

ఆత్మకూరు: రాష్ట్రంలోని గీతకార్మికులను ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేశారని గౌడసంఘం నాయకుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గీతకార్మికుల సొసైటీ కోసం 5 ఎకరాలు, గీతకార్మికులకు ద్విచక్రవాహనాలు, పెన్షన్లు ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. నవంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి గీతకార్మికులు తగిన గుణపాఠం చెప్పాలని, ఆ పార్టీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు.

ప్రమాదాలు జరిగినా పట్టింపులేదా



కంఠాత్మకూర్ బస్టాండ్ వద్ద గుంతలు పడిన రోడ్డు

నడికూడ: చూస్తే చిన్న గుంతే, కానీ ఆదమరిస్తే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మండలంలోని కంఠాత్మకూర్ బస్టాండ్ కూడలి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ద్విచక్ర వాహనదారులకు గాయాలైన సందర్భాలూ ఉన్నాయి. పరకాల నుంచి అంబాల వెళ్లే మలపు వద్ద రోడ్డుపై గుంత ఏర్పడినా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని, పూడ్చాలని కోరుతున్నారు.

రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయం ఖాయం



నాయీబ్రాహ్మణులతో కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాయీబ్రాహ్మణులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో పాటు నాయీబ్రాహ్మణుల కోసం తీసుకొచ్చిన పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. నవంబర్ 30వ తేదీన జరిగే ఎన్నికల్లో పాడి కౌశిక్‌రెడ్డికి ఓట్లేసి గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మొగిలిచెర్ల రాంబాబు, కుమారస్వామి, శ్రీనివాస్, మధు, వీరస్వామి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల వివరాలపై నిర్వహించనున్న సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలని ఎంపీడీఓ గుండె బాబు కోరారు. మండలంలోని వివిధ గ్రామాలకు వచ్చే బృందం సభ్యులకు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం 2022–23 సంవత్సరంలో మండల వ్యాప్తంగా జరిగిన రూ.4 కోట్ల పనులకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సామాజిక తనిఖీలు పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. అనంతరం ఎస్ఆర్పీ రఘు మాట్లాడుతూ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఈ నెల 29 నుంచి సామాజిక తనిఖీ బృందాలు 12 బృందాలుగా విడిపోయి వారం రోజుల పాటు గ్రామాల్లో పర్యటిస్తూ తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీఓ విమల, ఎస్‌టీఎం వేణు, ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన వారిని ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

శాయంపేట : భూపాలపల్లి నియోజకర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి కోరారు. కొత్తగట్టు సింగారం గ్రామంలో శనివారం ఆయన ఆ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. పత్తిపాక సర్పంచ్ రాజిరెడ్డి పాల్గొన్నారు.